క్లుప్తంగా

సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలి



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్

బంగారుపాళెం: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించారు. దారి సమస్యలు, భూసర్వే, రికార్డుల్లో తప్పులను సరి చేయాలంటూ పలువురు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పరిధిలో సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్‌ఓలు తమ రెవెన్యూ గ్రామాల పరిధిలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ కల్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు



మాధవరం గర్భిణికి వైద్యం చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: మండలంలోని పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. సోమవారం మండలంలోని మాధవరంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌వేలు మాట్లాడుతూ పేదలకు ఇంటి వద్దకే వైద్యం అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరుచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

అపోలో హాస్పిటల్ అధినేతకు సత్కారం



ప్రతాప్ సి రెడ్డిని కలిసిన చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు

తవణంపల్లె: అపోలో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ ప్రతాప్ సి రెడ్డిని సోమవారం చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ బృందం సోమవారం మండలంలోని అరగొండ కలిసి సత్కరించారు. అనంతరం సొసైటీ సభ్యులు చిత్తూరు నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు సభ్యులు వివరించారు. అపోలో ఆస్పత్రుల సీఈఓ సత్యనారాయణ రెడ్డిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు తాండవమూర్తి, సత్య, మురళి, చంద్రబాబు, శివకుమార్, జనార్దన్, పుణ్యకోటి, నాగేంద్ర, ఈసీ గణేష్, ప్రగతిశ్రీనివాస్, అక్బర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

హాఫ్ మారథాన్‌లో సీఐ విజయం



హాఫ్ మారథాన్‌లో సీఐ రామకృష్ణ

చిత్తూరు అర్బన్: తిరుపతి జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో పనిచేస్తున్న సీఐ రామకృష్ణ హాఫ్‌మారథన్‌లో విజయం సాధించారు. సోమవారం హైదరాబాద్‌లో ఎన్‌ఎండీసీ మారథాన్–2025ను నిర్వహించింది. ఈ మారథాన్‌ను 1.45 గంటల్లో పూర్తి చేసి విజయం సాధించారు. పలువురు పోలీసు అధికారులు ఆయనను అభినందించారు.

ఘనంగా రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో రాహు, కేతు, సర్ప దోష నివారణ పూజలు చేపట్టారు. ప్రత్యేక పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకున్నారు. అనంతరం మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

చవితికి సర్వం సిద్ధం

అంతటా చవితి సందడి మొదలైంది. వాడవాడలా పందిరి ఏర్పాట్లు మొదలైంది. చురుగ్గా పనులు సాగుతున్నాయి. మండపాలు, విద్యుత్ కటౌట్‌లు భారీస్థాయిలో వెలుస్తున్నాయి. నగరంలోని డీఐ రోడ్డులో భారీ ఎత్తున ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఇక మరిన్ని చోట్ల కూడా గణనాథున్ని కొలువు దీర్చేందుకు ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. ఏర్పాటు పనుల్లో నిర్వాహకులు బిజీబిజీగా ఉన్నారు.

- చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో జోరందుకున్న చవితి ఏర్పాట్లు
- సర్వాంగ సుందరంగా మండపాలు ముస్తాబు
- ఏర్పాట్లలో బిజీగా నిర్వాహకులు
- పూలకు పెరిగిన డిమాండ్



ప్రతిమల కొనుగోలులో యువకులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని డీఐ రోడ్డులో ఏటా వినూత్న రీతిలో వినాయకుని ప్రతిష్టిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా భారీగా వినాయకున్ని ప్రతిష్టించేందుకు సిద్ధమయ్యారు. ఏర్పాటు పనులు సైతం శరవేగంగా పూర్తి చేస్తూ వస్తున్నారు. పెద్దఎత్తున విద్యుత్ దీపాలంకరణ కటౌట్‌లు కట్టారు. మండపం ముఖద్వారం వద్ద తీర్చిదిద్దిన సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈసారి వివిధ రూపాల్లో ఉన్న ఐదు భారీ విగ్రహాలను కొలువు దీర్చనున్నారు. బుధవారం చవితిని ప్రారంభించనున్నారు. శేష పూజలు జరుగుతాయి. అలాగే కేరళ వాయిద్యం, భజన కార్యక్రమాలు ఉంటాయి. స్వామివారి నిమజ్జనం రోజు కేరళ, కర్ణాటక, తమిళనాడు వాయిద్యాలతో ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అలాగే కొంగారెడ్డిపల్లి, గిరింపేట, సంతపేట, ఎస్టేట్, కట్టమంచి, మురకంబట్టు, దొడ్డిపల్లి తదితర ప్రాంతాల్లో కూడా చవితిని అట్టహాసంగా జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.

మందస్తు బుకింగ్‌లు..

గంగ జాతర తర్వాత భారీస్థాయిలో జరిగే పండుగల్లో చవితి ఒకటి. వినాయక చవితిని వాడవాడలా జరుపుకుంటారు. ఈ పండుగ నిర్వహణలో పెద్దల కంటే ఎక్కువగా యువతే ముందుంటుంది. అధిక వ్యయం చేస్తూ..పండుగను నిర్వహించేలా ప్రణాళికలు చేసుకుంటుంటారు. మరికొందరైతే చవితి పేరుతో చీటీలు వేసి ఆ నగదును రెండింతలు చేస్తుంటారు. ఖర్చులకు వెనుకాడకుండా పండుగను జరుపుతుంటారు. ప్రధానంగా మండపం ప్రత్యేక ఆకర్షణగా నిలవాలని చూస్తుంటారు. విద్యుత్ అలంకరణతో ముస్తాబు చేస్తుంటారు. ముఖ్యంగా గణపతి విగ్రహం ప్రజలు మెచ్చేలా ఉండేలా పెడుతుంటారు. పూజలు, ప్రసాదాలు కూడా వ్యయం అధికంగానే చేస్తుంటారు. ఇకపోతే సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పు వాయిద్యాలకు లక్షల్లో వ్యయం చేయడం పరిపాటిగా మారింది. ఈసారి కూడా పలు చోట్ల భారీ అంచనాలతో వీధుల్లోకి కొలువుదీరనున్నాడు. వినాయక చవితి పండుగ నేపథ్యంలో అన్నింటికీ భలే గిరాకీ ఏర్పడింది. మండపాలు వేసే వారి నుంచి బ్యాండు మేళం వరకు ఫుల్ డిమాండ్ ఉంది. మాలల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పూలు దొరకడం లేదంటూ పూలమాలలు కట్టే వ్యక్తులు రేట్లను మూడింతలుగా పెంచేశారు. డప్పు వాయిద్యాలకు ఆర్డర్లు పుంజుకుంటున్నాయి.

బొజ్జ గణపయ్య.. భలే..భలే..!

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో పలుచోట్ల వివిధ రూపాల్లో వినాయకుడు కొలువు దీరనున్నాడు. చవితిని పురస్కరించుకుని స్థానికులతో పాటు రాజస్థాన్, హైదరాబాద్‌కు చెందిన పలువురు దొడ్డిపల్లి, మురకంబట్టు, బంగారు పాళ్యం రోడ్డు, కొంగారెడ్డిపల్లి, కాణిపాకం రోడ్డు తదితర ప్రాంతాల్లో గణేశుడి బొమ్మలను తయారీ చేస్తున్నారు. ఇక్కడ చిన్నబొమ్మల నుంచి పెద్దబొమ్మల వరకు అమ్మకాన్ని పెట్టారు. ఇవన్నీ కూడా వినూత్న రీతిలో ఉన్నాయి. వీటి కొనుగోలుకు యువకులు ఆసక్తి చూపుతున్నారు. ఇలా కొనుగోలులో పలు తయారీ కేంద్రాలు బిజీబిజీగా కనిపిస్తున్నాయి.



పరమేశ్వరుడిగా గణనాథుడు



డీఐ రోడ్డులో ఏర్పాటైన మండపం



డీఐ రోడ్డులో పందిరి ముఖద్వారం



విద్యుత్ కటౌట్



వాహనంలో తరలిస్తున్న విఘ్నేశ్వరుడి ప్రతిమ

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

గుడిపాల: వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా అనుమతులు పొందాలని ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు ఎటువంటి చలానా కట్టాల్సిన పనిలేదన్నారు. హెచ్‌టిటిపిఎస్//గణేష్ ఉత్సవ్ డాట్ నెట్‌లో లాగిన్ అయి పూర్తి చిరునామా, ఫోన్ నంబర్లు, మండపం ఏర్పాటు వివరాలు నమోదు చేసి దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలన్నారు. అనుమతి పొందిన వారి మొబైల్‌కు క్యూఆర్ కోడ్ వస్తుందని తెలిపారు. దాన్ని పోలీసులు మండపాల వద్ద తనిఖీ చేస్తారన్నారు. ఇందులో భాగంగా ఆదివారం బొమ్మసముద్రం క్రాస్ వద్ద వినాయక మండపాలను ఏర్పాటు చేస్తున్న వాటిని ఆయన తనిఖీ చేసి ఉత్సవ కమిటీలకు దిశానిర్దేశం చేశారు.

ప్రణాళికతో విద్యనభ్యసించాలి



మాట్లాడుతున్న చైర్మన్ తేజోమూర్తి

చిత్తూరు కలెక్టరేట్ : ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రణాళిక ప్రకారం విద్యనభ్యసించాలని విజయం ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ తేజోమూర్తి అన్నారు. సోమవారం ఆ ఇంజినీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిగ్రీ కళాశాలను ఏ ఆశయంతో స్థాపించానో అదే ఆశయంతో ఇంజినీరింగ్ కళాశాల స్థాపించినట్లు తెలిపారు. ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థికి ఉద్యోగ అవకాశం కల్పించడమే తమ ధ్యేయమన్నారు. అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ విప్ శ్రీకాంత్ మాట్లాడుతూ క్వాంటం టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీలతో భవిష్యత్‌లో అనేక అవకాశాలున్నాయన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు విజయం విద్యాసంస్థలు కల్పవృక్షమని చెప్పారు. కార్యక్రమంలో గ్రావిట వైస్ ప్రెసిడెంట్ ఏపీ శర్మ, అకడమిక్ డైరెక్టర్ శైలజ, ప్రిన్సిపల్ గోపి, ఇంజినీరింగ్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

వి.కోట: వి.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. హెచ్‌ఈసీ గ్రూప్‌లో ఎకనామిక్స్ ఉర్దూ మాధ్యమంలో బోధించేందుకు ఎంఏ ఎకనామిక్స్ ఉర్దూ మాధ్యమంలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. నర్సింగ్ గ్రూపుల్లో బోధించడానికి బీఎస్సీ నర్సింగ్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందిన దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఆసక్తిగల వారు ఈనెల 30వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి

గంగవరం: మండల పరిధిలోని సరమట్లపల్లిలో సోమవారం చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, కలశారాధన, హోమం, మహా గణపతి పూజ, కలశ స్థాపన, మహా కుంభాభిషేకం చేపట్టారు. అనంతరం స్వామివారి తిరు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి మర్రిమాకులపల్లిలో మేలుదీపం, పుష్ప పల్లకి సేవ చేపట్టారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



ప్రసంగిస్తున్న సివిల్ జడ్జి భారతి

పూతలపట్టు(యాదమరి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని.. అందుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించినా శాఖాపరంగా కఠిన చర్యలు తప్పవని చిత్తూరు సివిల్ జడ్జి భారతి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన బాల్య వివాహాలపై అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసులో ఆడపిల్లలకు పెళ్లి చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా వారు బలహీనులవుతారని చెప్పారు. బాల్య వివాహం వల్ల బాలికలు గర్భం దాల్చే సన్నద్ధత లేకపోవడంతో పుట్టబోయే బిడ్డకు, తల్లికి ప్రాణహాని ఉంటుందన్నారు. అనంతరం పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఎవరైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ క్కరూ బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసులు, పాఠశాల కమిటీ చైర్మన్ నేతాజీ, నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరి



న్యూ బార్న్ కేర్ కార్నర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ ధనలక్ష్మి

ఐరాల: ప్రభుత్వ ఉద్యోగులకు విధి నిర్వహణలో బదిలీలు తప్పనిసరి అని.. ఎక్కడ పనిచేసినా గుర్తింపు తెచ్చుకునేలా విధులు నిర్వహించాలని ఎంపీడీఓ ధనలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న పది మంది బదిలీపై వెళ్తుండడంతో వైద్యాధికారి రెడ్డెప్ప ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎంపీడీఓ మాట్లాడారు. వైద్యశాఖలో పనిచేస్తున్న సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఉద్యోగులకు బదిలీలు సహజమని, ఇదే సేవాభావాన్ని కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె పీహెచ్‌సీలో న్యూ బార్న్ కేర్ కార్నర్, నూతన ల్యాబ్ పరికరాల గదిని ప్రారంభించారు. పీహెచ్‌సీ ఆవరణలో వాకింగ్ ఏరియా, నూతన బోరు ఏర్పాటు చేయాలని వైద్యాధికారి రెడ్డెప్ప ఎంపీడీఓకు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆమె స్పందిస్తూ అవసరమైన ఏర్పాట్లు తక్షణమే చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఏఎన్‌ఎంలకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు చిన్నమ్మ, మునిరత్నం, ల్యాబ్ టెక్నీషియన్ అజార్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చవితి మహోత్సవాన్ని విజయవంతం చేద్దాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): విజయ వినాయక మహోత్సవాన్ని విజయవంతం చేయాలని విజయ వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు ప్రశాంత్ కోరారు. చిత్తూరు నగరం దొడ్డిపల్లి ప్రాంతంలోని వినాయక వీధిలో సోమవారం ఆ కమిటీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏటా తమ ప్రాంతంలో వినాయక చవితిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అదే రీతిలో ఈసారి కూడా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. గత రెండు నెలలుగా ఈ ఏర్పాటల్లో నిమగ్నమైనట్లు చెప్పారు. 40 అడుగుల ఎత్తు కలిగిన మట్టి విగ్రహాన్ని తీర్చిదిద్దామన్నారు. చవితి రోజు(బుధవారం) ఉదయం 10.30 గంటలకు తొలి పూజ జరుగుతుందన్నారు. 11 రోజుల పాటు చవితి పూజలను విశేషంగా నిర్వహిస్తామన్నారు. 29న కల్యాణోత్సవం ఘనంగా జరిపిస్తామన్నారు. సెప్టెంబర్ 6వ తేదీన ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం జరుగుతుందన్నారు. అనంతరం మహోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వంశీకృష్ణారెడ్డి, కరుణాకర్, భానుప్రసాద్, చెన్న శ్రీకాంత్, జయప్రకాష్, నలినికుమార్ తదితరులున్నారు.

ఆటో విరాళం



ఆటోను అందజేస్తున్న దృశ్యం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి సోమవారం ఓ దాత ఆటో విరాళంగా అందజేశారు. చిత్తూరులోని శ్రీనివాస మోటార్స్ నిర్వాహకులు జీవరత్నం రెడ్డి రూ.3.4 లక్షలు విలువ చేసే ఆటోను ఆలయానికి అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు. మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఏఈవో రవీంద్రబాబు పాల్గొన్నారు.

పింఛన్లు కొనసాగించండి సామీ..



రీవెరిఫికేషన్‌కు ఎంపీడీఓ కార్యాలయానికి దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన దివ్యాంగులు

బంగారుపాళెం: 'ఏన్నో ఏళ్లగా పింఛన్లు తీసుకుంటున్నాం.. ఇప్పుడేమో అనర్హత అంటూ నోటీసులు ఇచ్చి పింఛన్లు తొలగించారు.. ఆ పింఛన్ లేకపోతే మాకు పూట గడవదు.. చేతులు కాళ్లు సరిగా లేక బతకలేక చావలేక జీవిస్తున్నాం.. ఇప్పుడు మీరు ఆ పింఛన్ కూడా తీసేస్తే మేమెట్టా బతకాలి.. తిరిగి మా పింఛన్ మాకు ఇవ్వండి సారూ..' అంటూ పలువురు దివ్యాంగులు వేడుకున్నారు. సోమవారం ఎంపీడీఓ మహేష్‌కు వారు వినతిపత్రాలను సమర్పించారు. ప్రభుత్వం రీవెరిఫికేషన్ పేరిట అర్హత కలిగి ఉన్నా కూడా 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉందంటూ పింఛన్లు తొలగిస్తూ నోటీసులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరికి పింఛన్ మొత్తం తగ్గించారని, మరి కొందరికి అర్హతే లేదంటూ పింఛన్లకు కోత పెట్టారని వాపోయారు. మండలంలోని కొదలమడుగు, బోడబండ్ల తదితర గ్రామాల నుంచి పలువురు దివ్యాంగులు రీవెరిఫికేషన్ కోసం ఎంపీడీఓ కార్యాలయానికి దరఖాస్తులు తీసుకుని వచ్చారు. కొదలమడుగు పంచాయతీలో 22 మంది దివ్యాంగులకు పింఛన్లు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీడీఓ స్పందిస్తూ అర్హత కలిగిన దివ్యాంగులు మళ్లీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకుంటే పింఛన్ పొందేందుకు అవకాశం ఉందన్నారు.

దివ్యాంగులకు న్యాయం చేయాలి..

అర్హత కలిగి పింఛన్లు తొలగించిన వారికి తిరిగి పింఛన్లు మంజూరు చేసి న్యాయం చేయాలని ఎంపీపీ అమరావతి అన్నారు. మండలంలో చాలామంది దివ్యాంగుల పింఛన్లు తొలగించడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌తో ఆస్పత్రి ఖర్చులు, ఇతర అవసరాలకు ఆ డబ్బు వినియోగించుకుంటూ జీవనం గడుపుతున్నారని.. అధికారులు స్పందించి అర్హత కలిగిన వారికి పింఛన్లు మంజూరు చేయాలన్నారు.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



కట్టమంచి చెరువు వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని కట్టమంచి చెరువు వద్ద వినాయక నిమజ్జనానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం వినాయక చవితి నేపథ్యంలో.. నగర వాసులు చాలా వరకు వినాయ ప్రతిమలను కట్టమంచి చెరువులో నిమజ్జనం చేస్తుంటారు. చెరువు వద్ద భద్రత, చెత్తాచెదారం పడేయకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. సోమవారం ఇక్కడ జరుగుతున్న పనులను కమిషనర్ నరసింహ ప్రసాద్, మున్సిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

ప్రతి అర్జీని విచారించండి



బాధితుల సమస్యలు వింటున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన ప్రతి అర్జీని క్షేత్ర స్థాయిలో విచారించి, పరిష్కరించేలా చూడాలని మునిసిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యల్లో ఆర్థిక అంశాలతో ముడిపడని వినతులను తక్షణం పరిశీలించి పరిష్కరించాలన్నారు. చిత్తూరు నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌పై అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. ఈ గ్రీవెన్స్‌లో మునిసిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.

చిత్తూరు కార్పొరేషన్‌లో ఏఈ పోస్టులు ఖాళీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ ఇంజినీరు (ఏఈ) పోస్టులు దాదాపు ఖాళీ అయిపోయాయి. ఇక్కడ పనిచేస్తున్న పలువురు ఏఈలు ఇతర మున్సిపాలిటీలకు బదిలీపై వెళ్లారు. రూ.కోట్లలో అభివృద్ధి పనులు జరుగుతున్న నగరంలో.. వాటిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడానికి ఏఈలు తప్పనిసరి. తాజాగా ఇక్కడ ఉన్న ఒకేఒక్క ఏఈ లోకేష్‌కు డీఈఈగా పదోన్నతి కల్పిస్తూ పుత్తూరు మున్సిపాలిటీకి బదిలీ చేశారు. ఫలితంగా చిత్తూరులో ఖాళీ ఉన్న ఆరు ఏఈ పోస్టులు భర్తీకి నోచుకోలేదు.